చదువు

ఈనాడు హైదరాబాద్ 16
మంగళవారం జూన్ 5, 2018 ■ e-mail: edc@eenadu.in

ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు కొద్ది రోజుల్లో విడుదల కానున్నాయి. ఇప్పటికే తమకు ఎన్ని మార్కులు వస్తాయో విద్యార్థులకు అవగాహన ఏర్పడింది. తమ స్థాయికీ, ఇష్టానికీ తగ్గట్లుగా ఎక్కడ సీటు సాధించడానికి వీలుందో బేరీజు వేసుకునే తరుణమిది. గత ఏడాది కటాఫ్ మార్కులు, సీట్ల కేటాయింపును పరిశీలించడం ద్వారా తమ సీటు అవకాశాలను అంచనా వేసుకోవచ్చు. సరైన అంచనాతో దరఖాస్తు చేసుకోగలిగితే రెండేళ్ల కష్టానికి ప్రతిఫలం లభించినట్లు అవుతుంది. ఆ రకంగా కౌన్సెలింగ్ ప్రక్రియలో తడబడకుండా ముందస్తుగా సన్నద్ధం కావొచ్చు!



ఐఐటీ సీటుకు అవకాశం ఎంత?

ఇంటర్ ఎంపీసీ విభాగంలో చేరినవారిలో చాలా మందికి ఐఐటీల్లో ఇంజినీరింగ్ చదవాలనే బలమైన కోరిక ఉంటుంది. అయితే 11,98,989 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్ పరీక్షకు దరఖాస్తు చేసుకుంటే వారిలో 2,31,024 మందిని జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయడానికి ఎంపిక చేశారు. వారిలో కేవలం 1,60,716 మంది పరీక్ష రాయడానికి దరఖాస్తు చేసుకున్నారు. అంటే పరీక్ష క్లిష్టంగా ఉంటుందనే భయంతో క్వాలిఫై అయినవారిలో 70 శాతం మాత్రమే పరీక్ష రాశారు. 10,998 ఐఐటీ సీట్లు ఉన్నాయి కాబట్టి, అంతమంది విద్యార్థులు ఐఐటీల్లో చేరే అవకాశం ఉంది.

అంటే తుదిపరీక్షలోనూ పోటీ 1:16 ఉందని చెప్పొచ్చు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసిన ప్రతి 16 మంది విద్యార్థుల్లో ఒకరు మాత్రమే ఐఐటీల్లో చేరవచ్చు.

పి.వి.ఆర్.కె. మూర్తి
శ్రీ గాయత్రి అకాడమీ

ఈసారి ఐఐటీ కాన్పూర్ ఈ పరీక్షను నిర్వహించింది. ఫలితాలు జూన్ 10న విడుదల అవుతున్నాయి. అయితే కీ, ఓఎంఆర్ షీట్ ఇచ్చారు కాబట్టి, మార్కులపై విద్యార్థులకు అవగాహన ఉంది. గత ఏడాదితో పోలిస్తే ప్రథమ ర్యాంకు మార్కులతోపాటు తొలి పది ర్యాంకుల కటాఫ్ మార్కులు పెరిగే సూచనలున్నాయి. ఈ ఏడాది పేపర్-1, 2 కలిపి 360 మార్కులకు పరీక్ష జరిగితే వాటిలో 337 వరకు పొందినట్లుగా విద్యార్థులు చెబుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో తొలి పది ర్యాంకుల్లో ఎవరూ లేరనీ, ఉత్తర భారతదేశంలోనే ఎక్కువమంది ఉత్తమ ర్యాంకులు పొందే అవకాశం ఉందనీ ఓ అంచనా.

ఫలితాలు వెలువడిన వెంటనే ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఏఏటీ)కు హాజరు కావాలనుకునేవారు ఆన్‌లైన్‌లో 10, 11 తేదీల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. పరీక్ష జూన్ 14న నిర్వహిస్తారు. ఫలితాలను జూన్ 18న విడుదల చేస్తారు. జూన్ 19 నుంచి జులై 15 వరకు సీట్ల కేటాయింపు జరుగుతుంది. అంటే జూన్ 19 నుంచి జరిగే సీట్ల కేటాయింపునకు దరఖాస్తు చేసుకునే విద్యార్థి సీట్ల విషయంలో పూర్తి అవగాహనతో కళాశాల, బ్రాంచి ఎంపిక సరిగా చేసుకునేలా విశ్లేషించుకోవాలి. తప్పుగా గుర్తిస్తే తరువాత మార్చుకునే అవకాశం లభించకపోవచ్చు.

ఎంపికలో ప్రాధాన్యక్రమం

గత ఏడాది జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో తొలి ర్యాంకు సాధించిన విద్యార్థి సర్వేష్ ఐఐటీ-బాంబేలో కంప్యూటర్ సైన్స్ తీసుకున్నాడు. గత రెండు, మూడేళ్ల నుంచి ఎక్కువమంది విద్యార్థుల ఎంపిక ఐఐటీ-బాంబేనే అవుతోంది. వీటిలోనూ ఎక్కువమంది కోర్ గ్రూప్ సబ్జెక్టులపై ఆసక్తి చూపిస్తున్నారు. వీళ్ల ఎంపిక కూడా తొలి 8 ఐఐటీలు (బీహెచ్‌యూతో కలిపి), తరువాత రెండో విడతలో ప్రారంభించిన 8 ఐఐటీలు, ఆ తరువాత మిగిలిన 7 ఐఐటీలకు (కొత్తగా ప్రారంభించినవి) ప్రాధాన్యం ఇస్తున్నారు. ఐఐటీ-హైదరాబాద్‌కు మాత్రం పాత కళాశాలకు పోటీగానే ప్రాధాన్యమిస్తున్నారు. గత సంవత్సర ఓపెనింగ్, క్లోజింగ్ ర్యాంకులను గ్రూపులవారీగా పరిశీలనకు తీసుకుంటే ప్రాధాన్యక్రమం అర్థమవుతుంది.

ఐదువేల లోపు, ఆపై ర్యాంకులుంటే

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 5000లోపు ర్యాంకు సాధించినవారు ఎక్కువగా కోర్ గ్రూపు సబ్జెక్టులు, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, ఈసీఈ, ఈఈఈలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఇక ఎక్కువ ర్యాంకు అంటే 5000 పైన సాధించినవారు ఇంజినీరింగ్ ఫిజిక్స్, మేథమేటిక్స్ అండ్ కంప్యూటింగ్‌లకు ప్రాధాన్యమిస్తున్నారు.

రెండు సంస్థలకు అధిక ప్రాధాన్యం

ఐఐటీలే కాకుండా జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకు ద్వారా ప్రవేశాలు కల్పించే ప్రముఖ సంస్థలు 9 ఉన్నాయి.

1. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరు 2. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ), విశాఖపట్నం 3. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఇంజినీరింగ్ అండ్ రిసెర్చ్ (ఐఐఎస్ఈఆర్), భోపాల్ 4. ఐఐఎస్ఈఆర్- మొహాలీ 5. ఐఐఎస్ఈఆర్-కోల్‌కతా 6. ఐఐఎస్ఈఆర్-పుణె 7. ఐఐఎస్ఈఆర్-తిరువనంతపురం 8. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ), తిరువనంతపురం 9. రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ (ఆర్‌జీఐపీటీ), రాయ్‌బరేలీ

వీటిల్లోనూ ఐఐఎస్‌టీ, ఐఐఎస్‌సీ-బెంగళూరులకు విద్యార్థులు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. వీటిలో కొన్నింటికి కేవీపీవై-ఎస్ఏ, కేవీపీవై-ఎస్‌బీ, కేవీపీవై-ఎస్ఎక్స్ ద్వారానూ, కొన్నింటిని జేఈఈ-మెయిన్ స్కోరు ద్వారా, మరికొన్నింటిని నీట్-యూజీ మార్కుల ఆధారంగానూ ప్రవేశాలు ఇస్తున్నారు. ఉదాహరణకు- ఐఐఎస్‌సీ, బెంగళూరులో బాచిలర్ ఆఫ్ సైన్స్ (రిసెర్చ్) ప్రోగ్రామ్‌లో ఆరు బ్రాంచీలు ఉన్నాయి. అవి: బయాలజీ, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, మెటీరియల్స్, మేథమేటిక్స్, ఫిజిక్స్. వీటిలో బయాలజీలో ప్రవేశానికి నీట్-యూజీ మార్కులు తీసుకుంటున్నారు. దీనిలో గతంలో నీట్‌లో 300లోపు మార్కులకు కూడా సీటు సాధించారు.

ఎన్ఐటీల్లో సీటు అవకాశాలు ఎక్కువ

ఆర్కిటెక్చర్‌వైపు ఆసక్తి ఉన్నవారికి కూడా ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఏఏటీ) మంచి అవకాశం. పరీక్షలో సాధారణ ప్రదర్శనతో కూడా మంచి కళాశాలలో సీటు సాధించే అవకాశం ఉంది. వీరికి కేవలం ఏఏటీ పరీక్షలోని ర్యాంకు ఆధారంగానే సీటు కేటాయిస్తారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 10,000కుపైగా ర్యాంకు సాధించినవారు జేఈఈ మెయిన్ ర్యాంకు ఆధారంగా ఎన్ఐటీల్లో ప్రయత్నించడం మేలు. ఎన్ఐటీల్లో సీట్లు ఎక్కువగా ఉన్నాయి, ప్రతి రాష్ట్రంలో స్వరాష్ట్ర విద్యార్థులకు 50% సీట్లు కేటాయిస్తారు. కాబట్టి సీటు పొందే అవకాశాలు ఎక్కువ.

ఐఐటీలు, ఎన్ఐటీల కౌన్సెలింగ్‌కి వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఐఐటీల్లో ఏదో ఒక బ్రాంచి కంటే ఎన్ఐటీల్లో విద్యార్థి తనకు నచ్చిన బ్రాంచి ఎంపిక చేసుకోవడం మేలు. అలాగే ఎన్ఐటీల్లో బాగా ఎక్కువ ర్యాంకు పొంది, వాటిలో ఏదో ఒక బ్రాంచిలో చేరడం కంటే ఎంసెట్ ర్యాంకు ద్వారా యూనివర్సిటీ కళాశాలల్లో కోరిన బ్రాంచిలో ఇంజినీరింగ్ చేరడం మెరుగైన నిర్ణయమవుతుంది.

గత సంవత్సరాల కౌన్సెలింగ్ సరళిని చూసుకుని అవగాహనతో నిర్ణయం తీసుకుంటే మంచి విద్యాసంస్థలో సీటు లభించి, ఆపై జీవితంలో చక్కగా స్థిరపడటానికి అవకాశం దొరుకుతుంది.

గత ఏడాది ఐఐటీల్లో సీట్లు సాధించిన ఓపెనింగ్, క్లోజింగ్ ర్యాంకుల పట్టిక, ప్రముఖ 9 విద్యా సంస్థల్లో కటాఫ్ ర్యాంకుల పట్టికలను www.eenadupratibha.net లో చూడండి.

అమ్మాయిలకు అదనపు సీట్లు

ఐఐటీలు, ఐఐఎస్‌సీ, వివిధ ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరుతున్న విద్యార్థుల్లో అమ్మాయిల సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది.

2014లో సుమారు 8.8% విద్యార్థినులు ఐఐటీల్లో చేరగా, 2015లో ఇది 9 శాతానికి చేరింది. మళ్లీ 2016లో 8 శాతానికి పడిపోయింది. ఈ పరిస్థితుల్లో మానవ వనరుల మంత్రిత్వశాఖ (ఎంహెచ్ఆర్‌డీ), కేంద్ర ప్రభుత్వం విద్యార్థినుల ప్రవేశాల సంఖ్యను పెంచాలని భావించాయి.

జాయింట్ అడ్మిషన్ బోర్డు (జేఏబీ) ఈ పరిస్థితిని అధిగమించే మార్గాలను కనుక్కోవడానికి ప్రొఫెసర్ టిమోతీ గోన్‌సాల్వ్స్ ఆధ్వర్యంలో ఒక కమిటీ వేసింది. ఈ కమిటీ సూచనల మేరకు బోర్డు 'సూపర్ న్యూమరసీ' కోటాను దశలవారీగా అమలు చేస్తున్నారు. ఈ సంవత్సరం నుంచి విద్యార్థినుల శాతం 14 చేసి, దాన్ని వరుసగా పెంచుతూ 2026 నాటికి 20 శాతం చేయాలని జేఏబీ ఉద్దేశం.

అంటే ఈ సంవత్సరం అమ్మాయిలకు గతంతో పోలిస్తే 600పైన సీట్లు పెరుగుతాయి. ఇది వారికి ఎంతో ఉపయోగపడే అంశం. విద్యార్థినుల్లో సీట్ల కోసం పోటీ బాగా తగ్గుతుందని చెప్పవచ్చు. ఒక సీటుకు పదిమంది లోపే పోటీ పడనున్నారు.

అబ్బాయిలకు నష్టం ఉండదు

అమ్మాయిలకు కేటాయించిన ఈ రిజర్వేషన్ కారణంగా అబ్బాయిల సీట్లపై ప్రభావం పడటమో, సంఖ్య తగ్గడమో ఉండదని ఎంహెచ్ఆర్‌డీ చెబుతోంది. ఈ ఏడాది 14% అమ్మాయిలను నింపడానికి నిర్ణీత సంఖ్య కంటే ఎక్కువ సంఖ్యలో సీట్ల కేటాయింపు ఉంటుంది. ఇవే 'సూపర్ న్యూమరసీ సీట్లు'. వీటిని జేఈఈ (అడ్వాన్స్‌డ్) క్వాలిఫై అయిన వారికి కేటాయిస్తారు. అయితే వారు బోర్డు ఎగ్జామ్స్‌లోనూ టాప్ 20 పర్సంటైల్ కలిగినవారై ఉండాలని ఎంహెచ్ఆర్‌డీ అధికారులు తెలిపారు.

ఒక ఉదాహరణను పరిశీలిద్దాం. ఒక ఐఐటీలో 100 సీట్లు ఉన్నాయనుకుంటే.. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్కోరు ఆధారంగా ఆ సంస్థలో 8 మంది అమ్మాయిలు, 92 మంది అబ్బాయిలకు ప్రవేశం లభిస్తుందనుకుందాం. ఈ 14% రిజర్వేషన్ రూల్ ప్రకారం అదనంగా ఆరుగురు అమ్మాయిలకు ప్రవేశం దొరుకుతుంది. వీరిని ప్రత్యేకమైన అమ్మాయిల మెరిట్ లిస్ట్ నుంచి ఎంపిక చేస్తారు. అబ్బాయిల ప్రవేశ సంఖ్య 92లో ఎలాంటి మార్పూ ఉండదు. కాబట్టి, అబ్బాయిల సీట్ల సంఖ్యలో కోత పడుతుందన్న బెంగ అవసరం లేదు.

కటాఫ్ తగ్గితే.... ప్రిపరేటరీ కోర్సు

ఐఐటీల్లో ఎస్‌సీ, ఎస్‌టీ విద్యార్థుల సీట్ల సంఖ్య ఎంత ఉన్నదో అంతమంది విద్యార్థులు క్వాలిఫై కావడం లేదు. చదివే విద్యార్థుల్లో ప్రాథమిక అంశాలపై అవగాహన సరిగా ఏర్పరచాలనే ఉద్దేశంతో ఐఐటీల్లో ప్రిపరేటరీ కోర్సును ప్రారంభించారు. దీని ప్రకారం క్వాలిఫై కాని విద్యార్థులతో ఖాళీ సీట్లను భర్తీ చేస్తారు. ఈ విద్యార్థుల సంఖ్య 30 నుంచి 40 వరకూ ఉంటోంది. దివ్యాంగుల కేటగిరీలో కూడా 2009 నుంచి ప్రిపరేటరీ కోర్సును ప్రవేశపెట్టారు.

ఎలా ఎంపిక చేస్తారు?

రిజర్వేషన్ కేటగిరీల్లో కటాఫ్ మార్కు కంటే తక్కువ మార్కులు సాధించిన విద్యార్థుల్లో వారు పొందిన మార్కులను ఆరోహణ క్రమంలో అమర్చి, ఆ వరసక్రమంలో విద్యార్థులను ఎంపిక చేస్తారు.

ఈ కోర్సుకు ఎంపికైన విద్యార్థులకు ఒక సంవత్సరం రెండు సెమిస్టర్లలో మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్ నేర్పించి వారి సామర్థ్యాన్ని పెంచుతారు. అంతర్గతంగా పరీక్షలు నిర్వహించి తర్వాతి విద్యాసంవత్సరంలో ఫస్టియర్ ఇంజినీరింగ్ చదివే విధంగా చేస్తారు. ఈ విద్యార్థులు కచ్చితంగా రెసిడెన్షియల్‌గానే కొనసాగాలి. ప్రిపరేటరీ కోర్సు అన్ని ఐఐటీల్లోనూ ఉండకపోవచ్చు. ఎస్‌సీ, ఎస్‌టీ, దివ్యాంగుల సీట్లు మిగిలిపోయిన ఐఐటీల్లో మాత్రమే దీన్ని అమలుచేస్తారు.

కౌన్సెలింగ్ జాగ్రత్తలు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ద్వారా ఐఐటీల్లో ప్రవేశానికి 7 రౌండ్లలో కౌన్సెలింగ్ జరుగుతుంది. వీటిలో 2, 3 రౌండ్లను ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవచ్చు. కౌన్సెలింగ్ ప్రక్రియ వరుసక్రమం ఇలా ఉంటుంది- రిజిస్ట్రేషన్, కౌన్సెలింగ్, కోరిన కాలేజీ/ బ్రాంచి ఎంపిక చేసుకోవడం, సీట్ల కేటాయింపు, సీటు పొందిన కళాశాలలో రిపోర్టింగ్ చేయడం, ప్రొవిజినల్ కేటాయింపు పొందడం. వీటిపై అవగాహన ఏర్పరచుకోవాలి. జేఈఈ అడ్వాన్స్‌డ్-2018 రోల్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ, పాస్‌వర్డ్ ఉంచుకుని రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవచ్చు.

ఇవన్నీ జూన్ 19లోపు ఉంచుకుని రిజిస్ట్రేషన్ చేస్తే జూన్ 19 నుంచి జులై 15 లోపు సీట్ల కేటాయింపు జరుగుతుంది. కాలేజీ బ్రాంచి విషయంలోనూ గత సంవత్సర విశ్లేషణ చూసుకుని మొదట కాలేజీలు, బ్రాంచీల వరుస క్రమాన్ని తయారు చేసుకోవాలి. ఎన్ని కళాశాలలనే నిబంధన లేదు. కాబట్టి అన్నింటినీ సంబంధిత బ్రాంచీలతో ఆప్షన్లు పెట్టుకుని, సరిగా సీటు కేటాయింపు జరిగేలా శ్రద్ధ తీసుకోవాలి.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

సీడ్యాక్‌లో ఖాళీలు

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడ్యాక్) వివిధ ప్రాజెక్టుల్లో కాంట్రాక్టు పోస్టుల భర్తీకి దరఖాస్తులు. **పోస్టు-ఖాళీలు:** ప్రాజెక్ట్ మేనేజర్- 02, ప్రాజెక్ట్ ఇంజినీర్- 12, ప్రాజెక్ట్ ఆఫీసర్- 02, ప్రాజెక్ట్ అసోసియేట్- 02. **అర్హత:** సంబంధిత బ్రాంచులు/ సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్/ ఎంసీఏ, ఎంఎస్సీ, ఎంఈ/ ఎంటెక్, ఎంబీఏ, పీహెచ్‌డీ, పని అనుభవం. **ఎంపిక:** రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 15.06.2018 **వెబ్‌సైట్:** https://cdac.in/

ఫెర్రో స్క్రాప్ నిగమ్ లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్‌లు

భిలాయ్ (చత్తీస్‌గఢ్)లోని ఫెర్రో స్క్రాప్ నిగమ్ లిమిటెడ్ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు: ఎగ్జిక్యూటివ్(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్, మెటీరియల్స్ మేనేజ్‌మెంట్, ఎస్ఏపీ)- 11, జూనియర్ మేనేజర్ (మెయింటెనెన్స్ మెకానికల్)- 01, డిప్యూటీ జనరల్ మేనేజర్ (మెకానికల్)- 01. **అర్హత:** కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ, సీఏ/ ఐసీఎంఏ/ ఎంబీఏ/ ఎంసీఏ, పీజీ డిప్లొమా, పని అనుభవం. **ఎంపిక:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆఫ్‌లైన్ దరఖాస్తు చివరితేది:** 22.06.2018. **వెబ్‌సైట్:** http://www.fsnl.co.in/

ప్రవేశాలు

జేఎన్‌టీయూహెచ్‌లో ఎంఎస్సీ కోర్సులు

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో 2018-19 సంవత్సరానికి ఎంఎస్సీ కోర్సు ప్రవేశాలు. **విభాగాలు:** బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ. **సీట్ల సంఖ్య:** ఒక్కో విభాగంలో 25 చొప్పున మొత్తం 100. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. **ఎంపిక:** ప్రవేశపరీక్ష ఆధారంగా. **పరీక్ష తేది:** 10.07.2018. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్. **చివరి తేది:** 23.06.2018. **వెబ్‌సైట్:** http://jntuh.ac.in/

ఐఐఎస్‌టీలో యూజీ ప్రోగ్రాం

తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ 2018-19 విద్యా సంవత్సరానికి యూజీ ప్రోగ్రాంలో ప్రవేశాలు. **ప్రోగ్రాం-సీట్లు:** నాలుగేళ్ల బీటెక్ (ఏరోస్పేస్)- 60, నాలుగేళ్ల బీటెక్ (ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్- ఏవియానిక్స్)- 60, అయిదేళ్ల డ్యూయల్ డిగ్రీ (బీటెక్, ఎంఎస్సీ/ ఎంటెక్)- 20. **అర్హత:** 75 శాతం మార్కులతో పన్నెండో తరగతి(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్), జేఈఈ (అడ్వాన్స్‌డ్)-2018 ఉత్తీర్ణత. **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ:** 05.06.2018 నుంచి 15.06.2018. **వెబ్‌సైట్:** www.iist.ac.in

ఆర్‌జీఐపీటీలో యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు

అమేథీ(ఉత్తర్‌ప్రదేశ్)లోని రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ 2018-19 విద్యాసంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలు. **కోర్సు-సీట్లు:** బీటెక్(పెట్రోలియం/ కెమికల్ ఇంజినీరింగ్)- 120, ఎంటెక్ (పెట్రోలియం/ కెమికల్ ఇంజినీరింగ్)- 40, పీహెచ్‌డీ (పీఈజీ, ఇంజినీరింగ్, బేసిక్ సైన్స్, మేనేజ్‌మెంట్, హ్యూమానిటీస్). **అర్హత:** సంబంధిత సబ్జెక్టులు/ బ్రాంచుల్లో ఇంటర్, బ్యాచిలర్, మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణత, జేఈఈ (అడ్వాన్స్‌డ్), నెట్, గేట్, క్యాట్, జీమ్యాట్, జీఆర్ఈ స్కోరు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** బీటెక్ కోర్సుకు 05.07.2018; ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సులకు 12.06.2018. **వెబ్‌సైట్:** www.rgipt.ac.in

ఎంటెక్ (ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ)

హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయం, సీఆర్ రావు అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్ సంయుక్తంగా ఎంటెక్ (ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ) కోర్సు అందిస్తున్నాయి. **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో బీటెక్ (సీఎస్ఈ/ ఐటీ/ ఈఈఈ/ఈసీఈ) లేదా ఎంసీఏ లేదా ఎమ్మెస్సీ (మ్యాథ్స్/ స్టాట్/ ఐటీ/ సీఎస్/ ఎలక్ట్రానిక్స్) కోర్సుల్లో ఉత్తీర్ణత. దీంతోపాటు కంప్యూటర్ సైన్స్ లేదా ఐటీ విభాగంలో గేట్ స్కోర్ అవసరం. **దరఖాస్తు:** జూన్ 7 నుంచి జూన్ 30 వరకు. **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

మెటలర్జీలో ఉద్యోగావకాశాలేంటి?

■ ఇంటర్ పూర్తిచేశాను. మెటలర్జీ కోర్సుకి సంబంధించిన వివరాలను తెలియజేయండి. ఉద్యోగావకాశాలెలా ఉంటాయి?

- ఉపేంద్ర కుమార్ రెడ్డి

జ: ఇంటర్ తరువాత మెటలర్జీ ఇంజినీరింగ్ కానీ, డిప్లొమా ఇన్ మెటలర్జీ ఇంజినీరింగ్ కోర్సును కానీ చేయొచ్చు. జేఎన్‌టీయూ పరిధిలోని అతికొద్ది ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో ఈ ఇంజినీరింగ్ కోర్సు అందుబాటులో ఉంది. ఎంసెట్ ర్యాంకు ద్వారా ప్రవేశం పొందొచ్చు. పాలీసెట్ ద్వారా కూడా పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం పొంది లేటరల్ ఎంట్రీ ద్వారా మూడేళ్ల ఇంజినీరింగ్ కోర్సులో చేరొచ్చు.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లానింగ్ అండ్ టెక్నాలజీ- గుజరాత్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫౌండ్రీ అండ్ ఫోర్జ్ టెక్నాలజీ- రాంచీ, ఐఐటీ- మద్రాస్, బాంబే, రూర్కీ, కాన్పూర్, వారణాసి, కొన్ని ఎన్ఐటీలు ఈ కోర్సును అందిస్తున్నాయి.

ఈ కోర్సు చదివినవారికి ప్రైవేటు ఉక్కు కర్మాగారాలు, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్, హిండాల్కో, ఇండస్ట్రీస్, కేబుల్ కార్పొరేషన్ లాంటి సంస్థల్లో మెటలర్జికల్ ఇంజినీర్లు, టెక్నిషియన్లు, ప్రాసెస్ అనలిస్టులుగా ఉద్యోగాలు పొందే అవకాశాలున్నాయి. మెటల్ ఎక్స్‌ట్రాక్షన్, అల్లాయ్ మ్యానుఫాక్చరింగ్, హెవీ మెషీన్ తయారీ కర్మాగారాల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి.

మల్టీమీడియా అండ్ యానిమేషన్..

■ ఇంటర్ పూర్తిచేశాను. బీఎన్‌సీ మల్టీమీడియా అండ్ యానిమేషన్ చేయాలనుంది. కోర్సు వివరాలు, అందించే సంస్థలేవి? - షణ్ముఖి

జ: మల్టీమీడియా అండ్ యానిమేషన్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉంది. ఇది పూర్తిగా సృజనాత్మకతకు సంబంధించింది. ఈ రంగంలోకి వెళ్లే ముందు ఈ కోర్సు చదవడానికి ముందూ, చదివిన తర్వాతా రాణించడానికి కావాల్సిన లక్షణాలు మీకున్నాయో లేవో బేరీజు వేసుకోండి. సృజనాత్మకతతోపాటు కంప్యూటర్‌తో ఎక్కువసేపు పనిచేయగలిగే నేర్పు, ఓర్పు చాలా అవసరమవుతాయి.

ఈ కోర్సు చదివినవారికి గ్రాఫిక్స్, టీవీ, మీడియా, అడ్వర్టైజింగ్, గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్, వెబ్‌సైట్ డిజైనింగ్, యానిమేషన్, ప్రింట్, డిజిటల్ మార్కెటింగ్, ఆన్‌లైన్ కంటెంట్ తయారీ సంబంధిత సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి. ఈ కోర్సును అతికొద్ది సంస్థలు మాత్రమే అందిస్తున్నాయి. కేఎల్ యూనివర్సిటీ- విజయవాడ, జేవియర్ యూనివర్సిటీ- భువనేశ్వర్, వీఐటీ- వెల్లూర్, అమిటీ యూనివర్సిటీ- ముంబయి, మణిపాల్ యూనివర్సిటీ- మణిపాల్, లయోలా అకాడమీ- సికింద్రాబాద్ మొదలైనవి వాటిలో కొన్ని.

ఈ కోర్సులు చాలావరకూ ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లోనే అందుబాటులో ఉన్నాయి. ఈ రంగంలో అవకాశాలతోపాటు పోటీ కూడా తీవ్రంగా ఉంటుంది. ఈ విషయాన్ని గమనించి సబ్జెక్టుపై పట్టు, నైపుణ్యాలను సాధించగలిగితే భవిష్యత్తు చాలా బాగుంటుంది.



- ప్రొ. బి. రాజశేఖర్,
కెరియర్ కౌన్సెలర్